అమ్మో..! గ్రామ సింహాలు

పారిశ్రామిక ప్రాంతంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ మూకుమ్మడిగా దాడికి పాల్పడుతూ ప్రజలను గాయపరుస్తున్నాయి. రోజూ కుక్కకాటు బాధితులు ఆస్పత్రుల బాట పడుతున్నారు. దీంతో రోడ్లపైకి రావాలంటే చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సింథియా

- బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు
- వెంటాడి మరీ గాయపరుస్తున్న వైనం
- నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికుల వినతి



63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు



జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల పరిధిలోని ఏకేసీ కాలనీ, చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్రకాలనీ, కాకరలోవ,త్రినాథపురం, దుర్గానగర్, గుడివాడఅప్పన్నకాలనీ, ప్రకాష్‌నగర్, జనతాకాలనీ, శ్రీహరిపురం, మల్కాపురం తదితర ప్రాంతాల్లో వీధుల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి.ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వారిని వీధి కుక్కల వెంటపడి తరుముతుండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. నడిచి వెళ్లే వారు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పిక్కలు పీకేస్తున్నాయి.

యూపీహెచ్‌సీల్లో నమోదైన కేసులు ఇలా...

పారిశ్రామిక ప్రాంతంలో జనవరి నెలలో 15 మంది, ఫిబ్రవరిలో 12 మంది, మార్చిలో 13మంది, ఏప్రిల్‌లో 15 మంది, మేలో 18 మంది, జూన్‌లో 16 మంది, జూలైలో 15 మంది కుక్కకాటుకు గురై గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో, క్రాంతినగర్ యూపీహెచ్‌సీ, 40వ వార్డు ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీలో చికిత్స పొందినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క ప్రభుత్వాస్పత్రుల్లోనే కుక్కకాటుకు గురైన వారి సంఖ్య ఈ స్థాయిలో ఉంటే, ఇక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించిన వారి సంఖ్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

వెంబడించి మరీ ..

వీధుల్లో తిరిగే వారినే కాకుండా ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారినీ కుక్కలు వదలడం లేదు. వెంబడించడంతో వాహనదారులు పలు ప్రమాదాలు గురైన సందర్భాలు ఉన్నాయి. వీధికుక్కల నియంత్రణ కోసం సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల ఉత్పత్తికి చేపట్టాలని, ఏరివేయాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రణ లేకపోవడం వల్లే అనర్థాలు

వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలను డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తే తగ్గేవని ప్రజలు అంటున్నారు. అయితే ఈ ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నది కావడంతో అధికారులు చేతులెత్తేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇక పశుసంవర్ధక శాఖ అధికారులు వీధికుక్కల నియంత్రణ తమ పనికాదని, జీవీఎంసీ పరిధిలోకి వస్తుందని చెబుతున్నారు.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

వీధి కుక్కల దాడిలో గాయపడిన వారికి వెంటనే రేబిస్ వ్యాక్సిన్ వేయడం వల్ల కొంతవరకు ప్రమాదాన్ని అరికట్టవచ్చు. ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీలో ప్రస్తుతం సుమారు 50 రేబిస్ వ్యాక్సిన్లు, క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో 45, ఇక గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో 150 వరకు రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

బయటకు వెళ్లాలంటే భయం



మా ప్రాంతంలో వీధి కుక్కలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల మా వీధిలో ఒక మహిళ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెంబడించి ఆమె కాలిని గాయపరిచాయి. అప్పటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– కృప, 40వ వార్డు

వీధి కుక్కలను నియంత్రించాలి



ప్రజలపై వీధి కుక్కల దాడులు అధికమవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఎక్కడి నుంచో కుక్కలను తీసుకువచ్చి మరీ మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. దీంతో ఆ కుక్కలు చిన్నపిల్లలు వీధుల్లోకి రాగానే వెంబడించి మరీ గాయపరుస్తున్నాయి. వాహనదారులను వెంబడించడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించిన వీధి కుక్కల నియంత్రణకు చర్యలు మాత్రం తీసుకోవడంలేదు.

–శైలజ, 63వ వార్డు



షిప్‌యార్డ్‌కాలనీ క్రీడామైదానంలో వీధి కుక్కల స్వైర విహారం



వీధి కుక్కల దాడితో గాయపడిన నేవీ ఉద్యోగి

క్లుప్తంగా

ఘనంగా స్ఫటికలింగం ప్రారంభోత్సవం



శివాలయంలో పూజలు చేస్తున్న మళ్ల విజయ ప్రసాద్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని గౌరీపరమేశ్వరులను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ఫటిక శివలింగాన్ని అత్యంత వైభవోపేతంగా ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మళ్ల విజయ ప్రసాద్‌కు స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫ్యామిలీ రిట్రీట్



వేదికపై మాట్లాడుతున్న చర్చి పెద్దలు

విశాఖ విద్య: స్క్రిప్చర్ యూనియన్ మరియు సీఎస్ఎస్ఎం విశాఖపట్నం ఆధ్వర్యంలో ఎన్ఏడీ కొత్త రోడ్డులోని యునైటెడ్ క్రైస్ట్ చర్చిలో ఫ్యామిలీ రిట్రీట్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్,సుజాత, విజయనగరం మహారాజా కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ శారా మహారాజన్ హాజరై సమాజంలో జరుగుతున్న పలు సంఘటనపై చర్చించారు. కుటుంబ వ్యవస్థ, భార్యాభర్తలు, పిల్లలు- బాధ్యతలు, విలువలు, మంచి చెడులపై చర్చించి పలు సూచనలు సలహాలు చేశారు. ప్రొఫెసర్ శారా మహారాజన్ మాట్లాడుతూ పిల్లలు ఎదుటివారిని మనస్ఫూర్తిగా గౌరవించేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో స్క్రిప్చర్ యూనియన్ స్థానిక యూనిట్ చైర్మన్ కేపీ జాన్సన్, కన్వీనర్ జి.జాన్ ప్రభాకర్, యునైటెడ్ క్రైస్ట్ చర్చి సంఘ పాస్టర్లు రెవరెండ్ హేబెల్, రెవరెండ్ ఎం. కిరణ్ చంద్ర ప్రసాద్, రెవరెండ్ అనిల్ నాయుడు, సంఘ అధ్యక్షులు డి.జాకబ్‌రాజు, సెక్రటరీ జి.విజయ ప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

నేనున్నానని..



విశాఖ విద్య: జీవీఎంసీ 90వవార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్‌లో శనివారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి రాఖీలు కట్టారు. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజల పక్షాన పోరాడుతాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- 89వ వార్డులో ఉత్సాహంగా బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

గోపాలపట్నం: ఎన్నికల ముందు ఇష్టం వచ్చినట్టు హామీలిచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజప్రసాద్ ధ్వజమెత్తారు.వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్ అధ్యక్షతన శనివారం 89వ వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మళ్ల విజయప్రసాద్ మాట్లాడారు. సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. వీటి గురించి అడిగితే నాలిక మందంగా ఉందా అని కూటమి నాయకులు ఎదురు ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

భృతి భ్రాంతియేనా...

నిరుద్యోగ భృతిని భ్రాంతిగా మార్చేశారని విమర్శించారు. ఉద్యోగాలు కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది దాటినా ఇంత వరకు ఉద్యోగమూ లేదు భృతి లేదన్నారు. విద్యార్థులకు మొదటి ఏడాది తల్లికి వందనం ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. నిబంధనలు లేకుండా ఇస్తామని చెప్పి అమలు చేసే సమయానికి సాంకేతిక అంశాలను సాకుగా చూపి చాలా మందికి తల్లికి వందనం ఎగ్గొట్టారని విమర్శించారు. ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని.. ఎవరైనా నిలదీస్తే అందరికీ ఇచ్చేశామని చెప్పడం దారుణమన్నారు.

వైద్య, ఆరోగ్యం నిర్వీర్యం

చంద్రబాబు వైద్య, ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసి పేదలకు వైద్యం అందని స్థితిలోకి తెచ్చారని మండిపడ్డారు. మహానేత వైఎస్సార్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్య శ్రీని అందని ద్రాక్షలా మార్చేసి చాలా వైద్య సేవలను తొలగించేశారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామని.. స్మార్ట్ మీటర్లు వద్దని ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. వీటిపై కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేసే విధంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి బీఎస్ కృష్ణ, వార్డు అధ్యక్షురాలు దొడ్డి లక్ష్మి, 91వ వార్డు ఇన్‌చార్జి ఆళ్ల పైడిరాజు, షేక్ రహమాన్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు వద్దంటూ నిరసన

సింథియా: అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా ప్రజలు అడ్డుకోవాలని ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు పి.పైడిరాజు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల రీడింగ్ సిబ్బందితో తీయిస్తూ ప్రక్రియ ఆటంకాలు లేకుండా సాగుతుందని, కానీ అదానీ ప్రయోజనాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశించడం అన్యాయమన్నారు. ఇప్పటికే అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పరిశ్రమలకు, వాణిజ్య సముదాయాలకు బిగించారని, తాజాగా అపార్ట్‌మెంట్‌లకు కూడా బిగించాలని చూస్తున్నారని, ఇది చాలా అన్యాయమన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన నాయకులు విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, మంత్రి నారా లోకేష్ అదానీ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టమని ప్రజలకు పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చాక స్మార్ట్‌మీటర్లను ప్రోత్సహించడం సమంజసం కాదన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల వెనక్కి తీసుకోవాలని, లేదంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గండి రమణ, ముఠా కార్మికులు అప్పలనాయుడు, సత్యారావు, బి.అప్పారావు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆత్మీయత

గోపాలపట్నం: రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి సాక్ష్యంగా నిలుస్తోంది. అలాంటి రాఖీ పండగను శనివారం సందడిగా చేసుకున్నారు. అన్నా, తమ్ముళ్లకు హారతులిచ్చి రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ్ముళ్లను ఆశీర్వదించారు. అన్ని సమయాల్లో ఒకరికి ఒకరం తోడుగా ఉంటామని ఈ బంధం ఇలాగే కొనసాగిస్తామని చెప్పుకున్నారు. ఈ విధంగా సంతోషాలతో రాఖీ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలో రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరిపారు. మల్కాపురం సీఐ

సందడిగా రాఖీ పండగ

గొలగాని అప్పారావుకు శ్రీహరిపురం స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ బ్రహ్మకుమారీస్ సెంటర్ ఇన్‌చార్జి సింధు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా మహిళలకు అండగా ఉంటానని మాట ఇస్తున్నట్లు సీఐ అప్పారావు తెలిపారు.

ప్రతి ఇంటా రాఖీ శోభ

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా శనివారం కంచరపాలెం, కప్పరాడ, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం, సంజీవయ్య కాలనీ, బర్మాక్యాంప్, గొల్లకంచరపాలెం, దుర్గానగర్, గౌరీనగర్, సిద్ధార్థనగర్, ఆశవానిపాలెం, బాపూజీనగర్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లోనూ రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటా అన్నదమ్ములకు అక్కచెల్లెమ్ములు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు, చిరుకానుకలు అందుకున్నారు. కంచరపాలెంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్నారు.



మల్కాపురం సీఐ అప్పారావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సింధు



బాపూజీనగర్‌లో తమ్ముళ్లకు రాఖీ కట్టిన అక్క

వృక్షా బంధన్

గోపాలపట్నం: చెట్లను మనం రక్షిస్తే.. అవి మన తరతరాలను కాపాడుతాయని చెట్లు మనల్ని మన తరాల్ని రక్షిస్తాయని జేడీ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా శనివారం వృక్షాబంధన్ కార్యక్రమం చేపట్టారు. అందరూ అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కడితే జేడీ ఫౌండేషన్ సభ్యులు మాత్రం తమ పిల్లల చేత వృక్షాలకు రాఖీలు కట్టించారు. రేపటి తరాలకు ప్రకృతి పైన అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని జేడీ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ సలాది శ్రీరామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు కొత్తపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, కంచరపాలెం, కుర్మన్నపాలెం, నాయుడు తోట తదితర ప్రాంతాల్లో భారీ చెట్లకు రాఖీలు కట్టారు.



చిన్నారుల చేత వృక్షానికి రాఖీ కట్టిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

వృక్షోరక్షిత రక్షితః అన్న నినాదంతో తయారు చేసిన రాఖీలు చెట్లకు కట్టడం చాలా సంతోషదాయకంగా ఉందని పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. నిత్యం ఆక్సిజన్ అందించే చెట్లను రక్షించుకోవడం మన బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.